క్లుప్తంగా

గురుకుల పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పన : ఎమ్మెల్యే

నరసరావుపేట ఈస్ట్: సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాలల్లో మెరుగైన వసతుల్ని కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రైల్వే స్టేషన్ సమీపంలోని బాలికల గురుకుల పాఠశాలను ఆదివారం ఆయన సందర్శించారు. విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. తరగతి గదులు, విద్యార్థినుల వసతి గదులు, మరుగుదొడ్లు, నీటి సదుపాయం, విద్యుత్, ఫ్యాన్లు, వంటగది, భోజన ఏర్పాట్లు తదితర అంశాల్ని ఆయన పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారికి అందుతున్న సదుపాయాలు, సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. అధికారులు కూడా తమ పరిధిలోని వసతి గృహాల్ని సందర్శిస్తూ వసతుల్ని మెరుగుపరచాలని ఆయన సూచించారు.

ఆయుష్ వైద్య శిబిరంలో 72మందికి పరీక్షలు

వినుకొండ(నూజెండ్ల): ఆయుష్మాన్‌భవ కార్యక్రమంలో భాగంగా నూజెండ్ల మండలంలోని ములకలూరులో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్ ఆధర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 72మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం యోగా శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ కంచర్ల బాబు, యోగా టీచర్ వెంకటాచారి, స్వచ్ఛ భారత్ మండల కన్వీనర్ సుబ్బరామయ్య, సీహెచ్‌వో పఠాన్ మాబు సుభాని, ఏఎన్‌ఎం మహాలక్ష్మి, ఆశా కార్యకర్తలు మరియమ్మ,గంగమ్మ పాల్గొన్నారు.

చేతిరాత పోటీల్లో వినుకొండ విద్యార్థినుల ప్రతిభ



వినుకొండ(నూజెండ్ల): ఆగ్రాకు చెందిన స్వస్తిక్ హ్యాండ్ రైటింగ్ ఇంప్రూమెంట్ రీసెర్చ్ సెంటర్ గత ఆగస్టులో జాతీయ స్థాయిలో నిర్వహించిన ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ హ్యాండ్ రైటింగ్ పోటీల్లో వినుకొండకు చెందిన విద్యార్థినులు బేతంచర్ల జ్యోతి స్వరూప, బేతంచర్ల ఉషాకిరణ్మయి ప్రింట్ హ్యాండ్ రైటింగ్ విభాగంలో ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు. విద్యార్థినుల్ని ప్రముఖ చేతిరాత నిపుణుడు సోమేపల్లి వెంకటసీతారామయ్య, గ్రోమింగ్ కిడ్స్ కిండర్ గార్టెన్ స్కూల్ డైరెక్టర్ చేకూరి ఏడుకొండలు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఐఎంఏ చిలకలూరిపేట నూతన కార్యవర్గం



చిలకలూరిపేట టౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్, చిలకలూరిపేట శాఖ నూతన కమిటీ ఎంపిక ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని కేజే ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ లావు అరుణ, డాక్టర్ వై. మధులత, ఉపాధ్యక్షురాలిగా డాక్టర్ వెల్లటూరి రాణి, కోశాధికారిగా కొల్లా ప్రశాంతిని ఎంపిక చేశారు. పూర్వపు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కొల్లా అమర్, డాక్టర్ కందిమళ్ల వాసుదేవ అంకమ్మ చౌదరి నూతన కమిటీకి బాధ్యతలు అప్పగించి, శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ఇటీవల మృతి చెందిన వైద్యులు డాక్టర్ పావులూరి శివరామయ్య, డాక్టర్ గడగొట్టు వెంకటసుబ్బయ్యకు ఘనంగా నివాళులర్పించారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన మక్కెళ్ల సుబ్బారావు, లక్ష్మీ దంపతులు రూ.1,00,000 విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో ఆదివారం ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డిని కలసి విరాళం చెక్‌ను అందించారు. త్వరలో ప్రారంభం కానున్న ఆలయ పునర్నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేసి సహకరించాలని ఈవో కోరారు. ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుందని తెలిపారు.

యువకుల స్వచ్ఛంద రక్తదానం



నరసరావుపేట: ప్రతి వ్యక్తీ రక్తదానం చేయడం వల్ల నలుగురి ప్రాణాల్ని కాపాడే అవకాశం ఉందని డాక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జాతిపిత మహాత్మా గాంధీ జన్మదినోత్సవాల్లో భాగంగా సేవా పక్వాడ పేరుతో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న రక్తసేకరణలో భాగంగా ఆదివారం స్థానిక పల్నాడు బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో పదిమంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. దాతల్ని బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు శాలువాతో సత్కరించారు.పునీత్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ జానకీరామయ్య మాట్లాడుతూ తమ పల్నాడు బ్లడ్ సెంటర్ ద్వారా స్వచ్ఛంద రక్తదాతలకు రూ.5లక్షల ప్రమాద బీమాను వర్తించేలా పత్రాల్ని అందిస్తున్నామని తెలిపారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసేవారు బ్లడ్‌బ్యాంక్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ మోనటరింగ్ సెల్ సభ్యుడు పి.ఏ.రవిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో నూతన పాలనకు శ్రీకారం

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

బొల్లాపల్లి : సచివాలయ వ్యవస్థ ద్వారా నూతన పాలనకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. మండలంలోని గండిగనుమలలో సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్‌సెంటర్, రావులాపురంలో విలేజీ హెల్త్ క్లినిక్ నూతన భవనాల్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదిక నుంచి ఎమ్మెల్యే ప్రసంగిస్తూ రూ.40లక్షలతో సచివాలయాన్ని, రూ.21.80లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.35లక్షలతో రెండు విలేజీ హెల్త్ క్లినిక్‌లను పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టి పేదలకు అతి చేరువలో సేవలు అందిస్తున్నారని తెలిపారు. సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవస్థ ద్వారా 1.35లక్షల మందికి ముఖ్యమంత్రి ఉద్యోగాలు కల్పించారని చెప్పారు. గతంలో వైఎస్సార్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి జరిగిందని, నేడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలోనూ రెండూ వర్ధిల్లుతున్నాయని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ఈ ప్రభుత్వ హయాంలో అందాయని వివరించారు.

వరికపూడిశెల నిర్మిస్తాం

ఈ ప్రాంత ప్రజలకు వరికపూడిశెల ఎత్తిపోతల పథకం వర ప్రదాయిని అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. తాగు, సాగునీరు ద్వారా ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుందని ముఖ్యమంత్రి గుర్తించారని, ఈ ప్రాంత ప్రజల ఆశను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. అతి త్వరలో వరికపూడిశెల ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపడతామని ఆయన వెల్లడించారు. నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం చేపడతామని తెలిపారు.

రీ సర్వేతో రైతులకు ప్రయోజనం

గతంలో బ్రిటిష్ ప్రభుత్వం హయాంలో రీ సర్వే జరిగింది. ఈనాడు ముఖ్యమంత్రి రీ సర్వే నిర్వహించి రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలు ఎలాంటి రుసుం లేకుండా అందజేస్తున్నారని తెలిపారు. చుక్కల భూముల్లో పూర్తి హక్కులు రైతులకు లభించాయని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ పేదలకు అన్ని సౌకర్యాలతో పరిపాలన కేంద్రంగా గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. నియోజకవర్గాన్ని పదో శాసనసభ్యుడిగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నిరకాలుగా అభివృద్ధి చేశారని తెలిపారు. వినుకొండ పట్టణంలో తాగునీరు, ఘాట్ రోడ్డు నిర్మాణం, త్వరలో మెగా షాపింగ్ కాంప్లెక్ నిర్మాణం నియోజకవర్గ అభివృద్ధికి కొలమానమని వివరించారు. బొల్లాపల్లి మండలంలో వరికపూడిశెలతో పాటు రూ.13కోట్లతో ఎస్‌ఎస్‌పీ కాలువ నుంచి రక్షిత మంచినీటి పథకాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి అంగీకారం తెలపడం శుభపరిణామని పేర్కొన్నారు.

స్థల దాతకు సన్మానం

గండిగనుమలలో సచివాలయం, ఆర్‌బీకే భవనం నిర్మాణానికి ఉచితంగా స్థలాన్ని వితరణగా అందజేసిన బాలోజీ నాయక్‌ను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఘనంగా సత్కరించారు. రూ.25లక్షల విలువ చేసే 12 సెంట్ల స్థలాన్ని నూతన భవనాలకు ఉచితంగా అందజేసినందుకు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచులు దుర్గాబాయి, భీక్షాలు, ఎంపీటీసీ సభ్యురాలు మంగాబాయి, ఎంపీపీ బత్తి రాములు, జెడ్పీటీసీ సభ్యురాలు బీబ్లీబాయి , జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గోవిందు నాయక్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తి గురవయ్య, ఇన్‌చార్జి తహసీల్దార్, ఎంపీడీవో వి.సుధాకరశర్మ, షేక్ జిలానీ బాషా పాల్గొన్నారు.

వైఎస్సార్ జలకళ ప్రారంభం

బొల్లాపల్లి: నాడు రాజన్న హయాంలో సమగ్ర భూ అభివృద్ధి పథకంలో ఎస్సీ, ఎస్టీ భూముల సాగుతో అభివృద్ధి సాధించారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని గండిగనుమలలో వైఎస్సార్ జలకళలో భాగంగా బోరు ను ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తండ్రికి తనయుడుగా ముఖ్యమంత్రి ఎస్టీ, ఎస్సీ భూముల సాగుకు జలకళ ద్వారా బోర్లు ఏర్పాటుతో అభివృద్ధిలోకి తెస్తున్నారని తెలిపారు. డ్వామా పీడీ సీహెచ్. జోసఫ్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే చొరవతో ఈ గ్రామంలో వైఎస్సార్ జలకళ పథకం అమలుకు నోచుకుందని చెప్పారు. గ్రామం నుంచి 174 దరఖాస్తులు అందాయని, పరిశీలించి త్వరలో మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, డ్వామా ఏపీడీ బూసిరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన పది కుటుంబాలు

బొల్లాపల్లి: మండలంలోని గండిగనుమలలో టీడీపీ నుంచి పది కుటుంబాలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరాయి. తెలుగుదేశం నాయకులు నేనావతు ఏడుకొండలు నాయక్, శ్రీనునాయక్‌తో పాటు మరో ఎనిమిది కుటుంబాలకు చెందిన వారు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పార్టీ కండువా కప్పి వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరామని తెలిపారు.



ఏడుకొండలు నాయక్‌కు కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

వి.రెడ్డిపాలెంలో కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన

రొంపిచర్ల: జన్మభూమిపై అభిమానంతో తను పుట్టి పెరిగిన ప్రాంతంలోని గ్రామాల అభివృద్ధికి ఆర్థిక సహాయ సహకారాలు అందజేస్తున్న విర్కో ల్యాబ్స్ అధినేత డాక్టర్ నందిగల వెంకటరెడ్డి అభినందనీయుడని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని వి.రెడ్డిపాలెంలో రూ. కోటితో నిర్మించ తలపెట్టిన కమ్యూనిటీ హాల్ శంకుస్థాపనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నరసరావుపేట మండలం కేసానుపల్లిలో జన్మించిన పారిశ్రామికవేత్త డాక్టర్ నందిగల వెంకటరెడ్డి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల రూ.50 లక్షలతో దివ్యాంగులకు మోటారు సైకిళ్లను అందజేశారని తెలిపారు. బుచ్చిబాపన్నపాలెంలో శ్మశానవాటిక, ఉప్పలపాడులో స్కూల్ కాంపౌండ్, రెడ్డి బాలుర హాస్టల్‌లో డైనింగ్ హాల్, వంటగదిని ఆధునీకంగా నిర్మించారని చెప్పారు. కేసానుపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సహాయం చేశారని వివరించారు. ప్రస్తుతం నిర్మించ తలపెట్టిన కమ్యూనిటీ హాలుకు ఆయన రూ.50 లక్షలు, ఎంపీ అయోధ్య రామిరెడ్డి రూ.25 లక్షల అందిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ నందిగల వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మించ తలపెట్టిన కమ్యూనిటీ హాలును త్వరితగతిన పూర్తి చేయాలని, అవసరమైతే మరో రూ.25 లక్షలు అందజేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలోని మోడల్ స్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతుల గురించి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల్ని అడిగి తెలుసుకున్నారు. రూ.10 లక్షలతో ఎస్టీ కాలనీలో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. తొలుత ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ నందిగల వెంకటరెడ్డికి గ్రామస్తులు ఎదురేగి స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, పొలిమేర వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు దుద్దుకుంట యోగిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల రామకృష్ణ, సర్పంచ్ బత్తుల అంజయ్య, కశిరెడ్డి వెంకట కోటిరెడ్డి, సొసైటీ చైర్‌పర్సన్ పొలిమేర వెంకటరెడ్డి, అన్నెం పున్నారెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, కాకుమాను సదాశివరెడ్డి, గుండాల వెంకటేష్, గజ్జల ముసలారెడ్డి, చపారపు సంజీవరెడ్డి, బోడె సైదులురెడ్డి, పొలిమేర శ్రీనివాసరెడ్డి, వరికూటి శ్రీనివాసరెడ్డి, నలబోలు అంజిరెడ్డి, మూలె అంజిరెడ్డి, వనిపెంట పిచ్చిరెడ్డి, కల్లి పిచ్చిరెడ్డి, తెలగనేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నందిగం వెంకటరెడ్డిలకు గజమాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

వీరుల త్యాగం నిత్య స్మరణీయం

చిలకలూరిపేట టౌన్: దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరులు, పౌరులను గౌరవించుకొనే కార్యక్రమం నా మట్టి–నా దేశం అని జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు చెప్పారు. ఆదివారం విద్యాలయ ఆవరణలో నా మట్టి- నాదేశం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వివిధ గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు మట్టిని తీసుకొచ్చి విద్యాలయంలో ఏర్పాటు చేసిన కలశంలో పోశారని చెప్పారు. అమృత కలశ యాత్ర పేరుతో దేశంలోని 7,500 కలశాల్లో మట్టి, మొక్కల్ని సేకరించి ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారక స్తూపం పక్కన అమృత వాటిక పేరుతో ప్రత్యేక స్తూపాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నవోదయ విద్యాలయలో ఏర్పాటు చేసిన కలశాలు

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



సంకురాత్రిపాడులో వైద్య పరీక్షలు

నాదెండ్ల: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. గణపవరం, నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 15న ప్రారంభమైన సర్వే ఆదివారం కొనసాగింది. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఇంటింటికీ వెళ్లి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 30 నుంచి ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను వైద్యాధికారులు, మండల స్థాయి అధికారులు చేస్తున్నారు. గణపవరం పీహెచ్‌సీ పరిధిలో ఆదివారం అమీన్‌సాహెబ్‌పాలెంలో జరిగిన కార్యక్రమాన్ని వైద్యాధికారి ప్రసాద్ నాయక్ పర్యవేక్షించారు. నాదెండ్ల పీహెచ్‌సీ పరిధిలోని సంకురాత్రిపాడు, నాదెండ్లలో వైద్యాధికారులు ప్రియాంక, సాయిశ్వేత పర్యవేక్షించారు.

30న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడిలో 30న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్ ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా ఆరోగ్య కార్యకర్త దా సరి రాజ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ పృథ్వీరాణి, ఆశలు రెండు టీమ్స్‌లు ఏర్పడి వైద్య పరీక్షలు చేస్తామని పేర్కొన్నారు. గ్రామస్తులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

ఎన్టీఆర్ కాలనీలో వైద్య పరీక్షలు

చిలకలూరిపేట టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో వైద్య, ఆరోగ్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బీపీ, షుగర్, సీజనల్ వ్యాధుల గురించి పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వివరించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్వహించే ఫీవర్ సర్వే సహకరించాలని కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రారంభం

ఈపూరు : జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం నుంచి ప్రారంభించారు. కొచ్చర్ల ఆరోగ్య కేంద్రం పరిధిలోని అగ్నిగుండాల, అంగలూరు, వనికుంట, కొండ్రముట్ల గ్రామాల్లో పీహెచ్‌సీ వైద్యాధికారి నాగేంద్రబాబు ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. కుటుంబాల ఆరోగ్య పరిస్థితి పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ నెల 30 నుంచి గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించనున్నారు. కొండ్రముట్లలో సర్వేను జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి గీతాంజలి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వైద్య, ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నరసరావుపేట రూరల్: చిలకలూరిపేట రోడ్డులోని ఎస్‌ఆర్‌కేటీ సమీపంలో ఆదివారం సాయంత్రం చరిష్మా మార్కెట్‌కు ఎదురుగా ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొని యువకుడు మృతి చెందాడు. నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామానికి చెందిన చిన్నం పాల్‌రాజ్(20) ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పాల్‌రాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిరు ధాన్యాల్లో మెండుగా పోషకాలు



గర్భిణులకు పోషకాహార వంటకాల్ని రుచి చూపిస్తున్న అతిథులు

యడ్లపాడు: చిరు ధాన్యాల్లోనే మంచి పోషకాలు లభిస్తాయని గర్భిణులు, బాలింతలకు అవి ఎంతో ఆరోగ్యాన్నిస్తాయని ఏపీ బాలల హక్కు కమిషన్ మెంబర్ బత్తుల పద్మావతి చెప్పారు. యడ్లపాడులోని పీఆర్ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. పోషణ అభియాన్‌లో భాగంగా పౌష్టికాహారం వంటల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఐసీడీఎస్ నాదెండ్ల ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కార్యక్రమానికి సీడీపీవో జి. శాంత కుమారి అధ్యక్షత వహించారు. ముందుగా గ్రామంలోని వీధుల్లో పోషణ ర్యాలీ నిర్వహించారు. ఆయా వంటకాలను గర్భిణులు, బాలింతలు, తల్లులకు తినిపించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ తల్లులకు, గర్భిణులు, బాలింతలకు రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ వివరాల్ని తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిర్మూలన అంశాలపై అవగాహన కల్పించారు. మరో అతిథి ఎంపీపీ పిడతల ఝాన్సీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కేవలం పోషకాహారం పంపిణీయే కాకుండా ప్రీస్కూల్ విద్యార్థులకు పీపీ-1, 2 విద్యను కార్యకర్తలు విధిగా బోధించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కె. హేమలత, ఏసీడీపీవో బి. నిర్మలారాణి, వైఎస్సార్ క్రాంతి పథం సీసీ హేమలత, అసిస్ట్ ప్రతినిధులు వెంకన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల వితరణ

నాదెండ్ల: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్, గణపవరం వాసవీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పల్నాడు జిల్లా వాసవీ క్లబ్ గవర్నర్ కె. విజయలక్ష్మి, స్థానిక క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు అనిల్‌కుమార్, సీహెచ్. హనుమత్‌ప్రసాద్, రీజియన్ అధ్యక్షుడు అయితా శ్రీనివాసరావు సభ్యులతో కలసి ముందుగా గణపవరంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం శివాలయంలోని గోశాలను సందర్శించారు. తులసీ వనంలో వృద్ధులకు దుప్పట్లు, నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో కోశాధికారి రామస్వామి, రీజియన్ గవర్నర్ కె. సుబ్రహ్మణ్యం రీజియన్ చైర్మన్ మణిదీప్ పాల్గొన్నారు.

ఓ బొజ్జ గణపయ్యా.. నీ బంటు నేనయ్యా !

- వైభవంగా గణపతి నవరాత్రులు
- భక్తిశ్రద్ధలతో పూజలు
- పలుచోట్ల సందడిగా నిమజ్జనాలు

నరసరావుపేట ఈస్ట్: పట్టణంలోని చవితి పందిర్లలో గణపతి నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం స్వామి కల్యాణోత్సం , గణపతి హోమాల్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాతూరు మద్ది రాఘవయ్య బావి వద్ద యంగ్‌స్టర్స్ హెల్పింగ్ సర్వీసెస్ పందిరిలోని దశావతార సహిత శ్రీ వీరగణపతి సన్నిధిలో శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. పలువురు దంపతులు పాల్గొన్నారు.

- ప్రకాష్‌నగర్ 60అడుగుల రోడ్డు రాజీవ్‌గాంధీ విగ్రహంవద్ద ఏర్పాటు చేసిన పందిరిలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, జీడీసీసీ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బత్తుల బాలకృష్ణారెడ్డి, కూరపాటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం నిర్వహించారు.
- కోటప్పకొండ టీటీడీ వేదపాఠశాల పండితుడు శ్రీశ పర్యవేక్షణలో శ్రీవారి కల్యాణంలో ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పట్టణంలోని అధిక శాతం పందిర్లలోని గణనాథులు నిమజ్జనానికి తరలి వెళ్లారు.
- శ్రీరాంపురంలోని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పందిరిలోని గణనాథుడి 57కేజీల లడ్డూను మెడికల్ వ్యాపారి తిరువీధుల సుధాకరరావు రూ.1.53లక్షలకు, మహిళల కోసం ఏర్పాటు చేసిన 13కేజీల లడ్డూను చిలకల కోటేశ్వరరావు మిత్ర బృందం రూ.49వేలకు వేలం పాటలో దక్కించుకొన్నారు.

రూ.1.15లక్షలు పలికిన లడ్డూ ప్రసాదం

నరసరావుపేట: స్థానిక ప్రకాష్‌నగర్‌లోని సెయింట్ జోసెఫ్ స్కూలు వద్ద పదో వార్డు గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి పందిరిలో ఆదివారం నిర్వహించిన 16కేజీల లడ్డూ ప్రసాదం బహిరంగ వేలం పాటలో గొట్టం సుబ్బారెడ్డి రూ.1.15లక్షలకు దక్కించుకున్నారు. లాటరీలో రూ.40వేలు విలువైన ఫ్రిడ్జ్‌ను ఆవుల సుధాకరరెడ్డి దంపతులు, గ్రైండర్‌ను ఆరెకూటి శ్రీనివాసరెడ్డి దంపతులు చేజిక్కించుకున్నారు. నిమజ్జనం సందర్భంగా భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. అనంతరం ఊరేగింపు మధ్య స్వామిని నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి, కమిటీ సభ్యులు కె.లక్ష్మారెడ్డి, దేవరపల్లి శివాంజనేయరెడ్డి, అంకిరెడ్డి, బాబూయాదవ్, కంజుల రోశిరెడ్డి, కె.ప్రసాదు, దేవరపల్లి అంజిరెడ్డి, తియ్యగూర వీరారెడ్డి, నాగరాజు, పిచ్చిరెడ్డి, సోమశేఖరరెడ్డి పాల్గొన్నారు.



విప్పర్లపల్లిలో గణేష్ విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న ముస్లిం యూత్

వినాయక మండపాల్లో ఎమ్మెల్యే బొల్లా ప్రత్యేక పూజలు

వినుకొండ(నూజెండ్ల) : వినాయక చవితి పండుగ సందర్భంగా వినుకొండ పట్టణంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్ని ఘనంగా నిర్వహిస్తున్న ఆయా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల్ని వారు అభినందించారు.

భారీగా గణనాథుడి వేడుకలు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో రైల్వేస్టేషనుకు వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద 16వ వార్షికోత్సవాన్ని ముదిరాజ్ యూత్ సభ్యులు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్వామిని దర్శించుకొన్న భక్తులకు ఆదివారం కమిటీ సభ్యులు తీర్థప్రసాదాల్ని అందజేశారు. మండలంలోని బొందిలిపాలెం గ్రామ మహిళల కోలాటం ఆకట్టుకుంది. ఈనెల 26న స్వామి నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామస్తుడు మద్దినేని హరిబాబు ముదిరాజ్ (సీఏ) వేడుకలు సందర్భంగా రూ. 50 వేలు వితరణ చేశారు.

కోలాహలంగా నిమజ్జనాలు

యడ్లపాడు: గణపతి నవరాత్రుల మహోత్సవంలో భాగంగా ఆదివారం గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఏడవ రోజు ఏడు గ్రామాల్లోని చవితి పందిళ్లలో కొలువుదీరిన విఘ్నేశ్వరుల 12 విగ్రహాల్ని గ్రామాల్లో భారీగా ఊరేగించారు. యువకులు, మహిళలు నృత్యాలు చేస్తూ జై బోలో గణపతి మహారాజ్‌కు జై అంటూ నినాదాలు చేశారు. తమ ఇళ్ల ముందుగా వచ్చిన పార్వతీతనయుడికి భక్తులు హారతులిచ్చి పూజలు చేశారు. యడ్లపాడు కొట్లబజారులోని గణేష్ విగ్రహానికి రంగురంగుల పూలతో భారీ అలంకరణ గావించడంతో విశేషంగా ఆకట్టుకుంది. యడ్లపాడులో ఐదు, కొండవీడులో రెండు, పుట్టకోట, కారుచోల, ఉప్పరపాలెం, లింగారావుపాలెం, చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామాల నుంచి ఒక్కో విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా యడ్లపాడు ఎస్‌ఐ సురేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాదెండ్లలో..

మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఏడో రోజు గణనాథుడు పూజలందుకున్నాడు. ఆలయాలు, ప్రత్యేక చలువ పందిళ్లలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. పలు గ్రామాల్లో నిమజ్జనాలు కొనసాగాయి. గణపవరంలోని శివనాగేంద్రస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మట్టి విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి గణనాథుడికి కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామివారి 11 కేజీల లడ్డూ ప్రసాదానికి బహిరంగ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన కాట్రు సురేష్, గుంటుపల్లి వేణు సంయుక్తంగా రూ.44,600కు దక్కించుకున్నారు. విగ్రహాన్ని నాదెండ్ల-గణపవరం డొంక రోడ్డులోని బుల్లెమ్మ బావి వద్ద ఉన్న చెరువులో నిమజ్జనం చేశారు. శాంతినగర్, జిల్లా పరిషత్ క్వారీ, సినిమా హాల్ సెంటర్‌లోని దాసునాయన మఠం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాలకు డప్పు వాయిద్యాల నడుమ కోలాహలంగా నిమజ్జనం చేశారు.

రొంపిచర్లలో..

మండలంలోని విప్పర్లపల్లి, వి.రెడ్డిపాలెం తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల్ని ఆదివారం నిమజ్జనం చేశారు. విప్పర్లపల్లిలో ముస్లిం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిమజ్జనోత్సవలో గ్రామ సర్పంచ్ గాదె రామిరెడ్డి పాల్గొన్నారు. కులమతాలకు, మతసామరస్యానికి ప్రతీకగా విప్పర్లపల్లిలోని ముస్లిం బజారులో వినయకుని విగ్రహం ఏర్పాటు చేసి వారం రోజుల పాటు నిత్య పూజలు అందించారు. నిమజ్జనోత్సవలో సర్పంచ్‌తో పాటు ముస్లిం నాయకులు షేక్ మహ్మద్ రఫి, షేక్ చిన్నా, గణపతి ముస్లిం యూత్ నాయకులు పాల్గొన్నారు.



నరసరావుపేటలో హెల్పింగ్ సర్వీసెస్ పందిరిలో శ్రీలక్ష్మీ గణపతి హోమం



లడ్డు ప్రసాదాన్ని వేలం పాటలో పొందిన సుబ్బారెడ్డితో కమిటీ సభ్యులు

అత్యధిక మార్కులు సాధించేందుకు చేతిరాత కీలకం

యడ్లపాడు: మండలంలోని లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఈనెల 14నుంచి ప్రారంభించిన చేతిరాత శిక్షణ ఆదివారం ముగిసింది. విద్యార్థులకు అందమైన చేతిరాత శిక్షణ అందించిన సొలస మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు, శిక్షకుడు షేక్ జున్నూసాహెబ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రామిరెడ్డి మాట్లాడుతూ పరీక్షల్లో అత్యధిక మార్కుల్ని సాధించేందుకు చేతిరాత కీలకమని తెలిపారు. అడిగిన వెంటనే ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చిన జున్నూసాహెబ్‌ను హెచ్‌ఎంతో పాటు పలువురు ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు సత్కరించారు.

నేడు జగనన్న స్వచ్ఛ సంకల్పంపై శిక్షణ

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జగనన్న స్వచ్ఛ సంకల్పం, స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ కార్యక్రమంలో భాగంగా ఒక రోజు శిక్షణ ఉంటుందని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్‌కే జిలానీ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని ఆయన కోరారు.

